

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ బిల్డింగ్‌లో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మహిళా పోలీసు అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యురాలు డా.శిరీష ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించే అంశాలపై ప్రసంగించారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్‌మాన్, అడ్మిన్ జాయింట్ సీపీ పరిమళ హన్ననూతన్, డీసీపీలు రక్షిత కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. -సిటీబ్యూరో


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, శనివారం 8 మార్చి 2025 HYDERABAD


## పొదుపు మంత్రం పాటిద్దాం

**లేదంటే జీవితాలు చిన్నాభిన్నమే**

**విచ్చలవిడిగా అప్పులు చేస్తే తిప్పలే**

ఆందోళన కలిగిస్తున్న ఆర్థికపరమైన ఆత్మహత్యలు

లక్షల్లో జీతం ఉన్నా.. అమెరికాలో కొలువున్నా..

పొదుపుపై అవగాహన లేకపోతే ఇబ్బందులే

ఆర్థిక క్రమశిక్షణ ఉండాలంటున్న నిపుణులు

డబ్బు విలువ తెలుసుకోవాలంటూ..సూచన

IVలో





## ముక్కుపుటాలదిరేలా..

సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ పరిధిలోని ఫిల్మ్‌నగర్-దర్గా రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలం వ్యర్థాలతో నిండిపోయింది. బల్దియా పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఇక్కడ దాదాపు 100 మీటర్ల విస్తీర్ణంలో చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. దీంతో ముక్కుపుటాదిరేలా దుర్వాసన వస్తుండటంతో వాహనదారులు అవస్థలుపడుతున్నారు.

# కరెంట్ కోతలు షురూ

**చీటికి మాటికి అంతరాయాలు**


**విసిగెత్తిపోయి ఫిర్యాదు చేస్తున్న జనం**

**రోజులో ఐదారు సార్లు పోయి వస్తున్న సరఫరా**

సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ): వేసవి ఆరంభంలోనే గ్రేటర్ హైదరాబాద్‌లో కరెంటు కష్టాలు కనిపిస్తున్నాయి. చాలాచోట్ల రోజుకు ఐదారు సార్లు కరెంటు పోయి... రావడంతో ఎండలు ముదిరి వినియోగం మరింత పెరిగేకొద్దీ ఈ కష్టాలు కూడా ఎక్కువైతాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా పరీక్షల సమయం కావడంతో పాటు వర్క్ ఫ్రం హోం చేసే ఉద్యోగులు ఇంటర్‌నెట్ ఆధారపడుతున్నందున ఈ స్వల్ప కాల కోతలు చిరాకు పుట్టిస్తున్నాయి. దీంతో పాటు పలుచోట్ల ముందుగానే ప్రకటించి ఒకట్రెండు గంటల పాటు కోతలు విధిస్తున్నారు. ఇదేమంటే మెయింటెనెన్స్ అని సమాధానమిస్తున్నారు. రోజురోజుకీ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో కూలర్లు, ఏసీల రూపంలో వినియోగం కూడా గణనీయంగా పెరుగుతున్నది. తద్వారా ఫీడర్లపై లోడ్ పెరగడంతోనే కరెంటు సరఫరాలో పదనిసలు చోటుచేసుకుంటున్నాయని అధికారులే అనధికారికంగా చెబుతున్నారు.

### ఈసారి ఫిబ్రవరిలోనే నమోదు..

గ్రేటర్ హైదరాబాద్‌లో రోజూ కరెంటు సరఫరాలో అంతరాయం అనేది సాధారణంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో కోతల ప్రభావం ఎక్కువ కనిపిస్తున్నా... నగరంలో మాత్రం కనిపించని కోతలు జనాన్ని ఇబ్బందులు పెడుతున్నాయి. గత నాలుగైదు రోజులుగా నగరంలో ఎండల ప్రభావం పెరిగింది. రాత్రి పూట ఉష్ణోగ్రతలు తక్కువ నమోదవుతున్నా గృహాల్లో పగటి ఎండల తాలూకు వేడి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. దీంతో కూలర్లు, ఏసీల వాడకం భారీ ఎత్తున పెరిగింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గతేడాది ఏప్రిల్ మాసంలో నమోదైన కరెంటు వినియోగం ఈసారి ఫిబ్రవరిలోనే నమోదైందని అధికారులే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఫీడర్లపై లోడ్ పెరిగి తరచూ కరెంటు సరఫరాలో అంతరాయానికి కారణమవుతున్నది. ప్రతిచోటా రోజులో కనీసంగా నాలుగైదు సార్లు కరెంటు పోయి... ఐదు, పది నిమిషాలకు రావడం చోటుచేసుకుంటున్నది. చీటికి మాటికి అంతరాయలతో విసుగెత్తున్న ప్రజలు తరచూ ఫిర్యాదులు చేస్తున్నారు.




### ఇది కీలక సమయం..

ప్రస్తుతం పరీక్షల సమయం. పరీక్షలకు సిద్ధమవ్వడంలో భాగంగా చాలామంది విద్యార్థులు ఇంటర్‌నెట్‌పైపై ఆధారపడి కొంతమేర చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో పాటు ఐటీ ఉద్యోగులు వర్క్‌ఫ్రంహోంలో కూడా ఉన్నారు. దీంతో వీరు కూడా ఇంటర్‌నెట్‌పై ఆధారపడి పని చేయాల్సి ఉంది. అయితే రోజులో నాలుగైదు సార్లు కరెంటు పోయి రావడంతో ప్రతిసారీ ఇంట్లో ఉన్న వైఫై కనెక్ట్ అయ్యేందుకు కొంత సమయం పట్టడం వీరిని ఇబ్బందులకు గురి చేస్తున్నది.

### ఓవర్‌లోడ్ కారణమా..

గ్రేటర్‌లో ఇటీవల తరచుగా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అనధికారికంగా కోతలు విధిస్తున్నారు. అంతరాయానికి కొంతమంది అధికారులు చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నామని చెబుతున్నారు. పలు ఫీడర్ల పరిధిలో అర్ధరాత్రి తర్వాత సరఫరా నిలిచిపోతుంటే.. మరికొన్ని ఫీడర్ల పరిధిలో తెల్లవారుజాము నుంచి కొన్ని చోట్ల.. మరికొన్నిచోట్ల మధ్యాహ్నం సరఫరా నిలిచిపోతున్నది.తమకు ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో వెంటవెంటనే పునరుద్ధరిస్తున్న అధికారులు.. బస్తీల్లో మాత్రం గంటకు పైగానే కరెంట్ పోయినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

### ఇబ్బందిపడ్డ ఐటీ ఉద్యోగులు

కొండాపూర్ శిల్పాపార్క్ వద్ద శుక్రవారం కరెంట్ కోతలతో వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కరెంట్ పోగా తిరిగి మూడు గంటలకు వచ్చింది. మళ్లీ ఒక అర గంట మధ్యలో పోయింది. తిరిగి 7 గంటలకు కరెంట్ పోయి 8గంటలకు వచ్చింది. ఇలా ఒక్కరోజులో నాలుగైదు సార్లు కరెంట్ పోవడంతో తాము తిరిగి బెంగళూరుకు వెళ్లిపోతామంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అన్నారు.



# అమ్మాయిలే టార్గెట్

**సైబర్ నేరగాళ్ల కొత్త పంథా.. మీ స్నేహితుల పేర్లు తచెప్పి ట్రాప్..**

**డబ్బులు లాగడమే లక్ష్యం..1930కు ఫిర్యాదు చేయండి**

- *నగరానికి చెందిన ఓ విద్యార్థినికి వాట్సాప్ నంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. మీ స్నేహితురాలు డ్రగ్స్ కేసులో ఇరుక్కుంది.. ఈ కేసులో మీ ప్రమేయం ఉన్నట్లు ఆమె ఫోన్‌లో ఆధారాలు లభించాయి అంటూ ఆగంతకులు బెదిరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏ క్షణంలో అయినా మిమ్మల్ని అరెస్ట్ చేసే అవకాశముందని, తప్పు చేయలేదని 24 గంటల్లో నిరూపించుకోవాలంటూ చెప్పారు. ఈ కాల్‌తో భయపడిన ఆమె తన తండ్రికి చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు.*
- *హైదరాబాద్‌కు చెందిన ఓ యువతికి తెలియని నంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. అమెరికాలో ఉన్న మీ స్నేహితులు అక్రమ నగదు లావాదేవీల్లో పట్టుబడ్డారు. వారు ఆ డబ్బును మీ బ్యాంక్ ఖాతాకు పంపినట్లు మాకు సమాచారం ఉంది.. మీ బ్యాంక్ ఖాతాను చెక్ చేయాలంటూ ఒక ఏపీకే ఫైల్ పంపారు. దాని ద్వారా బాధితురాలి ఫోన్‌ను హ్యాక్ చేసి 2.50 లక్షలు కొట్టేశారు.*

**- సిటీబ్యూరో, మార్చి7(నమస్తే తెలంగాణ):** .. నగరంలో ఇలాంటి ఘటనలు నెలలో రెండుమూడుకు పైగా జరుగుతూనే ఉన్నాయి. ఈ విధంగా మోసపోతున్నవారిలో విద్యార్థినులే ఎక్కువగా ఉంటున్నారు. వారిలో కూడా యువతులే ఎక్కువగా ఉండడం గమనార్హం. వారిని టార్గెట్ చేసి బెదిరించి ..వారి నుంచి డబ్బులు లాగడమే లక్ష్యంగా మోసగాళ్లు ప్లాన్ చేస్తున్నారు.

### కొత్త తరహా మోసాలు..

సైబర్ నేరగాళ్లు విద్యార్థినులు, యువతులు టార్గెట్‌గా కొత్త పంథాలో మోసం చేస్తున్నారు. తమ స్నేహితులు విదేశాల్లో ఉండడమో, ఇంకెక్కడో ఉన్నవారి వివరాలను సేకరించి ..వారిపేరు చెప్పి వాళ్లు ఒక పెద్ద కేసులో ఇరుక్కున్నారు.. వారి వద్ద మీ డేటా ఉంది.. మీరు కూడా వారికి సహకరించారంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

### అపరిచిత కాల్స్‌కు స్పందించొద్దు..

అమ్మాయిలు వాట్సాప్ కాల్స్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. తెలియని వ్యక్తులు, సంస్థల పేరుతో వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని, ఒకవేళ బెదిరించినట్లు కాల్ వస్తే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

## హోటళ్లలో నాణ్యత నిల్



సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ) :ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు ఇతర వాటిపై బల్దియా ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా అమీర్‌పేటలోని అమోఘ, తాజా కిచెన్, మెహిదీపట్నంలోని 4 సీన్స్ మల్టీకజిన్ రెస్టారెంట్‌లో తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించారు. ఈ మేరకు నోటీసులు జారీ చేశారు.

## నెలాఖరు వరకు 'ఓటీఎస్'

సిటీబ్యూరో: ఆస్తిపన్ను వసూళ్లలో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు జీహెచ్‌ఎంసీ ఎట్టకేలకు వన్ టైం సెటిల్‌మెంట్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. ఓటీఎస్ కింద ఆస్తిపన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ రాయితీ కల్పించాలన్న జీహెచ్‌ఎంసీ ప్రతిపాదన మేరకు అనుమతి ఇస్తూ శుక్రవారం పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెలాఖరు వరకు ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా సర్కిల్ వారీగా విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. కాగా, ఆస్తిపన్ను నిర్దేశిత వసూళ్లలో జీహెచ్‌ఎంసీ అపసోపాలు పడుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2100కోట్ల టార్గెట్ విధించుకోగా..ఇప్పటి వరకు దాదాపు రూ.1540కోట్ల మేర మాత్రమే చేరుకున్నారు. 12.60 లక్షల మంది ఆస్తిపన్ను చెల్లించగా...దాదాపు మరో 5 లక్షల మంది ఇంకా చెల్లించాల్సి ఉంటుంది. వీరి నుంచి దాదాపు రూ.560 కోట్ల మేర ఆదాయం రావాల్సి ఉంది. ఈ నెలలో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ఆస్తిపన్ను వసూళ్లను పెంచాలని నిర్ణయించిన అధికారులు ఈ మేరకు బకాయిదారులకు ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్) అవకాశం కల్పించాలని కోరడం...వెంటనే అధికారుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఓటీఎస్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలేవీ?

మేడ్చల్, మార్చి7(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లాలో 13 మున్సిపాలిటీలు, 34 గ్రామ పంచాయితీలలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తుగా చర్యలు తీసుకుని నివారణకు ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు ఆదేశించారు. అయితే నీటి ఎద్దడి అధికంగా ఉండే ప్రాంతాలను ఇప్పటి వరకు గుర్తించలేదని తెలుస్తోంది. నీటి ఎద్దడిపై ప్రజలు సమాచారం ఇస్తే తప్ప మున్సిపాలిటీల, గ్రామ పంచాయితీల పరిధిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నీటిని సరఫరా చేసే బోర్లు, చేతిపంపులలో తగినంత నీరు రాని పక్షంలో మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవడంలో అధికారులు నీటి ఎద్దడి నివారణ ప్రణాళికను అమలు చేయడంలో విఫలమవుతున్నారు.



# మహానగరికి ఆరో ప్రణాళిక

**ఇప్పటికే అమల్లో ఐదు మాస్టర్ ప్లాన్లు**

**ఓఆర్‌ఆర్ నుంచి ట్రిపులార్ వరకు హెచ్‌ఎండీఏ విస్తరణ**

సిటీబ్యూరో: మహానగరి విస్తరణకు తొలి అడుగు పడింది. హెచ్‌ఎండీఏ పరిధిని మరో 3వేల కిలోమీటర్ల వరకు విస్తరించి మరో బృహత్ ప్రణాళికకు శ్రీకారం చుట్టనున్నారు. ఇన్నాళ్లు హైదరాబాద్ అభివృద్ధిలో కీలకమైన ఐదు మాస్టర్ ప్లాన్లతో మరో ప్రణాళికతో మహానగర పరిధి విస్తరించనున్నది. దీంతో ఇప్పుడున్న హెచ్‌ఎండీఏ పరిధిలో సగ భాగం అదనంగా మహానగరంలో కలవనుంది. కేబినెట్ ఆమోదంతో ఓఆర్‌ఆర్ నుంచి ట్రిపులార్ వరకు విస్తరించి ఉన్న ప్రాంతం మొత్తం హెచ్‌ఎండీఏ ఆధీనంలోకి రానున్నది. దీనికి అనుగుణంగా పట్టణాభివృద్ధి ప్రణాళికలకు కీలకమైన మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరగనుంది. అయితే 7 జిల్లాల నుంచి 11 జిల్లాలకు విస్తరించే క్రమంలో హెచ్‌ఎండీఏ మరెన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏడు జిల్లాలు, 70 మండలాలు, 1032 గ్రామ పంచాయతీలతో ఉన్న హెచ్‌ఎండీఏ భవిష్యత్‌లో 4 జిల్లాలు, 36 మండలాలు, 336 గ్రామాలు చేరనున్నాయి.

### 2031 మాస్టర్ ప్లాన్ అందుబాటులో..

హైదరాబాద్ నగరాభివృద్ధికి ఇప్పటివరకు ఐదు మాస్టర్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 2031 మాస్టర్ ప్లాన్ అందుబాటులో ఉండగా.. మరో 25 ఏళ్ల హైదరాబాద్ పురోగతికి అనువుగా ఉండేలా ఏకీకృత ఆరో మాస్టర్ ప్లాన్‌ను అమలు తీసుకు వచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు.

### వేధిస్తున్న సిబ్బంది కొరత..


హెచ్‌ఎండీఏ పరిధి విస్తరించనున్న నేపథ్యంలో.. అరకొర సిబ్బంది ఇప్పుడు విస్తరణకు అతిపెద్ద సవాలుగా మారనుంది. 18 ఏళ్ల కిందట హెచ్‌ఎండీఏకు 600 పోస్టులు మంజురైతే... ఇప్పటివరకు ఉద్యోగుల సంఖ్య 15 శాతానికి దాటలేదు. ఇక ఉద్యోగులందరినీ డిప్యూటేషన్, అవుట్ సోర్సింగ్ విధానంలో నింపుతూ నెట్టుకొస్తున్నారు. అయి ప్రభుత్వం విస్తరణపై దృష్టి పెట్టిందే గానీ, ఆ తర్వాత జరగబోయే పరిణామాలు, చెరువుల పరిరక్షణకు చేపట్టాల్సిన ప్రణాళికలను మరింత పకడ్బందీ చేయాల్సిన అవసరం ఉంటుంది.

# 87% విద్యార్థులకు దృష్టి లోపం

సిటీబ్యూరో: చిన్నారుల కండ్లు ప్రమాదపు వలయంలో చిక్కుకుపోతున్నాయి. జిల్లాలో వైద్యాధికారులు చేస్తున్న కంటి పరీక్షల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లావ్యాప్తంగా 96.9 శాతం పరీక్షలు జరపగా, ఏకంగా 87.1శాతం మంది విద్యార్థుల కండ్లు దృష్టి సమస్యలతో సతమతమవుతున్నాయని వెల్లడైంది. వీళ్లందరికీ కళ్లజోడు పెడితే కానీ చదువు ముందుకు సాగదన్న విషయం తేటతెల్లమైంది. తరగతి గదిలో బోర్డుపై అక్షరాలను గుర్తించలేకపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి చదివే చిన్నారులందరికీ వైద్యాధికారులు గత నెల 17 నుంచి ఈ నెల 6 వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.

### 8578 మందికి టెస్టులు

హైదరాబాద్ జిల్లాలో 8578 మందికి టెస్టులు చేశారు. వారిలో 7471 మంది విద్యార్థులు తీవ్రమైన కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. 87.1శాతం మందికి కంటి అద్దాలు కావాల్సి ఉంది. ఇప్పటివరకు 1018 మంది విద్యార్థుల వరకే రాష్ట్ర ఆరోగ్యశాఖ కంటి అద్దాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. మిగతావారికి కూడా అతి త్వరలోనే వస్తాయని వైద్యాధికారులు తెలపడం గమనార్హం.



### ఆస్పత్రుల వారీగా వివరాలిలా..

- మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో 1598 మంది విద్యార్థులను పరీక్షించగా, 1095 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు.
- నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో 1235 మంది పిల్లలను పరీక్షించగా, 1095 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు తేలింది.
- కింగ్‌కోటీ జిల్లా ఆసుపత్రిలో 1460 మందికి పరీక్షించగా. 1411 మంది చిన్నారులకు దృష్టి సమస్యలు ఉన్నట్లు నిర్ధారణైంది.
- గాంధీ ఆసుపత్రిలో 1749 మందికి పరీక్షలు నిర్వహించగా 1646 మందికి కంటి లోపం ఉన్నట్లు వెల్లడైంది.
- సరోజినీదేవి కంటి ఆసుపత్రిలో 2536 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 2214 మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు.